
# ఇదీ జీవితం

కథ

## శశికళ లేచిపోయిందట!! రాత్రికి రాత్రే ఎవరో కుర్రాడితో ఇల్లొదిలి వెళ్ళిపోయిందట...!!

సామర్ల లక్ష్మీరాజ్



ఊరు ఊరంతా గుప్పు గుప్పుమంటోందీ వార్త! అసలే చిన్న పల్లెటూరు కావటంతో అందరి నోటంటా ఈ కబురే...!

గోల గోలగా జనం చెవులు కొరుక్కుంటున్నారు. ఆడంగులు నొసలు విరిచేస్తూ మరీ చెప్పుకుంటున్నారు. ఆ రోజు అదో హాట్‌న్యూస్ అయిపోయింది మా పల్లెలో...

పని మీద పట్నం వెళ్ళిన నేను ఊళ్ళోకి అడుగెట్టగానే వినిపిస్తోన్న కారు కూతలకు ఆశ్చర్యపోయాను. ముందు పుకార్లనే భ్రమించాను. కానీ ఎటొచ్చీ అది పచ్చి నిజమని తేలేసరికి [illegible]వైపోయాను.

ఎదురెదురు ఇళ్ళేమో శశికళ కుటుంబంతో మాకు మంచి స్నేహమే ఉంది. రాఘవయ్య మాస్టారి పెద్దమ్మాయే శశికళ. ఆ తరువాత ముగ్గురూ ఆడసంతానం. అది చాలదన్నట్టు ఆఖర్న పుట్టిన మగవలునులిద్దరూ...! ఆయనకొచ్చే ఆదాయానికీ ఇంటి వ్యయానికీ ఎప్పుడూ చుక్కెదురే!

అయినా... సత్సాంప్రదాయానికీ, ఆచార వ్యవహారాలకూ, పూజా పునస్కారాలకూ ఆ ఇల్లు పెట్టింది పేరు!

శశికళ...!

ఓహ్! గంధపు బొమ్మలా మేలిమిఛాయతో... పెద్ద పెద్ద కళ్ళని అల్లల్లార్చే కనురెప్పలతో మంచులో తడిసిన ముత్యంలా ఉండే అపురూప సౌందర్యరాశి.

ఒద్దికగా, నమ్రతగా ఉండే స్వభావం... ఎప్పుడూ తన పనేదో తనేవిటో... అంతే! వంచిన తల ఎత్తేది కాదు...

కానీ...

ఆ పెద్ద పెద్ద కళ్ళు నా వంక, బేలగా ఎప్పుడూ ఏదో ప్రశ్నిస్తున్నట్టుగా చూస్తూండేవి...! అటువంటి అమ్మాయి...

ఊళ్ళోకి కొత్తగా వచ్చిన జాన్‌పాల్‌తో వెళ్ళిపోవడం... భరించలేని సత్యం!

అసలు పరిచయం ఎలా ఏర్పడిందో... ప్రేమ ఎప్పుడు జనించిందో... అంతుతేలని ప్రశ్న ఆలోచనలతో నా తల వేడెక్కిపోతోంది. మెదడునెవరో చిదిపి చిధ్రంచేసిన భావన.

గుండెనెవరో నలిపేసిన ఫీలింగ్... ఎదురింటి అమ్మాయి... శశికళ ఇక కన్పించదంటేనే నాలో నిస్సత్తువ... ఓ నిర్వికారం! నా పరిస్థితి నాకే తెలియని అగమ్యగోచరంలా?

నిజంగా ఇన్నాళ్ళూ ఆ అమ్మాయిని మూగగా మనసులో ఆరాధించిన ప్రేమికుడిని!

హృదయం పాడిన మౌనగీతాలను అతిభద్రంగా గుండె గదిలో దాచుకున్న దురదృష్టవంతుడిని! తెగువ... గుండెధైర్యం లేని మగాడిని!!

తల్లిదండ్రుల మాటకు ఎదురుచెప్పలేని నిస్సహాయుడిని!

ఆలోచనల తుట్టని విదిలించుకునేసరికి ఎదురింట్లోంచి తారాస్థాయిలో వినిపిస్తున్నాయ్ అరుపులూ కేకలూ రోదనలూ!

అనునయించినట్లూ ఉంటుందీ... సంగతేవిటో తెలుస్తుందని నా కాళ్ళు అటు దారి తీసాయ్!

గుమ్మంలోనే నన్ను పట్టుకుని బావురుమంది రాఘవయ్యగారి భార్య...

'చూడు బాబూ! అది ఎంతపని చేసిందో...? మా పరువు ప్రతిష్ట గంగలో కలిపేసింది అప్రాచ్యురాలు! బరితెగించి కులంకాని వాడితో వెళ్ళిపోయింది!! పాపిష్టిది మా మడి ఆచారాలని మసిచేసిపోయింది!! అసలేమీ తెలియని పిల్ల! ఎంత అమాయకంగా ఉండేది! అలాంటిదాన్ని వాడే... వాడే ఆ దుర్మార్గుడు మాయమాటలతో మభ్యపెట్టేసి ఉంటాడు. వాడివల్లో తెలిగ్గా పడిపోయింది! అందుకే అంత ధైర్యంగా గడపదాటేసింది! ఇది దానికి పుట్టిన బుద్ధికాదు బాబూ...! ప్చ్...! అయినా మా ఖర్మ! ఇదంతా మేం చేసుకున్న పాపం! తలరాతని ఎవడూ మార్చలేడుగా? ఏం చేస్తాం?"... అంటూ తిట్లు, శాపనార్థాలతో ముక్కుచీదేస్తూ ఏడుస్తోంది!

భార్య పెంపకాన్ని నిలదీస్తూ... తిడుతూ... రంకెలు వేస్తూ "నా కడుపున అది పుట్టలేదనుకుంటాను! ఇన్ని నీళ్ళూ నువ్వులూ వదిలేస్తాను!! నాకది కూతురే కాదు!! ఈనాటి నుంచి అదెవరో? మేమెవరో...? ఛీ!ఛీ! కులంకాని వెధవతో లేచిపోతుందా? మన మతం, నీతీ, జాతీ అన్నీ వదిలేసి వెళ్తుందా? దరిద్రురాలు...?" అంటూ కూతుర్నీ 'అతన్నీ' పిచ్చికోపంతో శాపనార్థాలు పెడుతున్నారు రాఘవయ్యగారు.

"అంకుల్! అక్క ఈ ఉత్తరం వ్రాసి వెళ్ళిపోయింది!" అంటూ ఓ కాయితం ముక్క నాకందించాడు ఆ ఇంట్లోని ఆఖరివాడు.

నా కళ్ళు అక్షరాల వెంట పరుగుతీస్తూ...

అమ్మా నాన్నలకు...

నా ఉత్తరం మీకు కోపం, ఆవేశం ఆశ్చర్యం కలిగిస్తుంది. అందులో సందేహం లేదు. తల్లిదండ్రులుగా మీ పెంపకానికి పేరు పెట్టను! నాకు లోటు చేశారని నిందించను.

కానీ ఒక్కసారి... నావైపు నుండి కూడా



శునకం రికార్డ్

గినా అనే రెండేళ్ళ శునకం ఇటీవల ఓ అరుదైన ప్రపంచ రికార్డు సృష్టించింది. 25.80 ఎత్తుకు నిచ్చెనను ఎక్కి ప్రపంచ రికార్డుని తన సొంతం చేసుకుంది.

డి.వి.ఎల్.- నరేంద్ర

## ఆ పెద్ద పెద్ద కళ్ళు నా వంక, బేలగా ఎప్పుడూ ఏదో ప్రశ్నిస్తున్నట్టుగా చూస్తూండేవి...!

ఆలోచించండి. ఆర్థికంగా దిగువతరగతిలో పుట్టిన ఆడపిల్లను! అదీ కన్నెపిల్లను! కట్నాల బజారులో మొగుణ్ణి కొనుక్కోలేని నిరుపేదను! గత కొన్నేళ్ళుగా వచ్చిన మగపెళ్ళివారి ముందు నేనో ఎగ్జిబిషన్‌గా నుంచోటం, వాళ్ళకు పిల్లనచ్చి, కట్నం వచ్చక వెళ్ళిపోవటం పరిపాటి అయిపోయింది?!

హు! నాకూ ఓ మనసుంటుందనీ దానికీ కొన్ని ఆశలు ఉంటాయని మర్చిపోయారు మీరు! ఇరుగూ పొరుగులనే మాటలు, మగాళ్ళవెకిలి చూపులు సర్వసాధారణమైపోయాయి! అన్నిటినీ తట్టుకుని. ఎన్నాళ్ళని బుద్ధిగా ఓ మంచి పిల్లగా బ్రతకను?

అందుకే ధైర్యంగా నాకు నచ్చిన జాన్‌పాల్‌తో వెళ్ళిపోతున్నాను. అతని భార్యగా క్రొత్త జీవితాన్ని ప్రారంభించబోతున్నాను. నాకు కావలసిన తోడుని వెతుక్కున్నాను. ఈ జీవితం నాది. నాకు నచ్చిన విధంగా మలచుకునే అధికారం నాకుంది! అందుకే ఈ తిరుగుబాటు! నా దారిలోనే అందరూ వెళ్ళాలని అనుకోను. కానీ నేను చేస్తున్నది నా మనసుకి నచ్చిన పని! వీలైతే మమ్మల్ని ఆశీర్వదించండి!

-శశికళ

బాప్‌రే!! శశికళ ఎంత ఎదిగిపోయింది! మానసికంగా ఇంత మెచ్యూరిటీ సాధించిందంటే నమ్మశక్యం గాకుండా ఉంది.

నేటి ఆడపిల్లకు ఉండాల్సిన ధైర్యం, తెలివి, చొరవ, ఆత్మవిశ్వాసం అన్నీ ఉన్నాయ్. ఎటొచ్చీ... ఓ మగాడిలో ఉండాల్సిన సాహసం

ఆత్మస్థైర్యం, వ్యక్తిత్వం లేని వాడిని నేనే...! అనుకుంటూ బాధగా ఇంటికి చేరాను.

రాగానే అమ్మ మందలింపులు "ఏరా? ఎందుకా అప్రాచ్యపు కొంపకు తగలడతావ్? సూదిలా ఉండేవాళ్ళు దబ్బనంలా గుచ్చుకుపోతారు జాగ్రత్త! అవ్వ! అవ్వ! ఎంత దరిద్రపు పని చేసింది ఆ పాడుపిల్ల?? మగాడెప్పుడూ మగాడే! అయినా ఆడపిల్లకుండాలి మంచి గుణం. ఎంత పెళ్ళి చెయ్యకపోతే మాత్రం అందరినోట్లో మన్నుగొట్టి, తల్లిదండ్రుల కన్నుగప్పి ఎవరో ఏబ్రాసి వెధవతో వెళ్ళిపోవటమేనా? అయినా చూస్తూండు! ఆ లేపుకు పోయినవాడు దీనికి కడుపో, కాలో చేసి వదిలేసి పోతాడు. అప్పుడు దాని గతి.... హూ...! ఆ వెధవ గోలకేం గానీ... ఆ ఉయ్యూరు సంబంధం వాళ్ళు కబురుచేశారు. కట్నంతోపాటు నీకు ఉద్యోగం కూడా వాళ్ళే చూస్తారట!" అమ్మ మాటలు సాగిపోతూనే ఉన్నాయ్... మనసు బాలేక నా గదిలోకి నిష్క్రమించాను చిరాగ్గా...!

★ ★ ★

దాదాపు పదేళ్ళు గడిచిపోయాయి. ఆ ఊరు వదిలేసి హైదరాబాద్ మకాం మార్చేము. ఓరోజు పనిమీద అబిడ్స్‌కు వెళ్ళాను. మా వాడికి ఓ డ్రెస్ కొందామని అక్కడే ఉన్న పెద్ద గార్మెంట్స్ షాపులోకి అడుగు పెట్టేసరికి... నాలో గొప్ప ఆశ్చర్యం!

అక్కడ... కనిపించేరు రాఘవయ్యగారు..

మనిషి బాగా నునుపుదేలి, ఒళ్ళొచ్చి సిల్క్‌జుబ్బాలో హుందాగా షాపంతా కలియచూస్తూ అందర్నీ అజమాయిషీ చేస్తోన్నారు.

బక్కచిక్కి, కళ్ళు లోతుకుపోయి, నిర్వికారంగా ఉండే మా ఊరి రాఘవయ్యగారికీ ఇప్పటి రాఘవయ్యగారికీ ఎంత తేడానో... బాగానే గుర్తుపట్టగలిగేను.

ఆనందంగా దగ్గరకు వెళ్ళి "మాస్టారూ! బావున్నారా? నేను మీ నాగేంద్రను అచ్చనపల్లిలో ఎదురింట్లో వుండేవాళ్ళం. గుర్తున్నానాండీ?" అని నన్ను నేను పరిచయం చేసుకునేసరికి...

"ఓ...ఓ... ఆ నాగేంద్రవా? ఎన్నాళ్ళయిందో మన ఊరివాళ్ళని కలిసి! మీ తల్లిదండ్రులూ క్షేమమేనా?" అంటూ కుశల ప్రశ్నలు వేసేరు.

"అందరూ క్షేమమే! మీరేవిటి? ఇక్కడ ఉన్నారు? ఈ ఊరెప్పుడు వచ్చారు... ఈ షాపులో..." నా ప్రశ్న ఇంకా పూర్తికాకముందే...

"ఈ షాపు మా అల్లుడిదోయ్! మా జాన్‌పాల్‌ది. అతనెంత మంచివాడనుకున్నావ్? మా కుటుంబాన్ని ఆదుకుని ఒడ్డున చేర్చాడు. మా అమ్మాయిల వివాహాలు యోగ్యులతో జరిపించాడు. ఇప్పుడు తీరిక లేనంత వ్యాపారం చేస్తోన్నాడు. ఏవిటో...? ఆనాడు అమ్మాయి చేసిన పనిని హర్షించలేకపోయాము.

కానీ...

మా శశి మంచిపనే చేసిందయ్యా! మనిషికి కావల్సింది కులం, మతం కాదు మానవత్వం! మనిషిని మనిషి ప్రేమించగలిగే మంచితనం కావాలి. తోటి వ్యక్తిని ఆదరించే దయాగుణం అలవడాలి. నిర్మలమైన మనసూ, స్వచ్ఛమైన కరుణా, దయార్ద్ర హృదయాలే మనిషికి ఆభరణాలు!! అటువంటి మేలిమివజ్రమే నా అల్లుడు."

## తెలుగులో ప్రతిభా సిన్హా



అలనాటి హీరోయిన్‌ల కూతుళ్ళు ఇప్పుడు హీరోయిన్‌లుగా 'బాలీవుడ్'లోకి రావడం ఎప్పుడో మొదలైంది. అయితే 'బాలీవుడ్'లో అంతగా వేషాలులేని హీరోయిన్‌లు దక్షిణాది వైపు దృష్టి మరల్చడం ఎక్కువయిందీమధ్య.

మాలాసిన్హా కూతురు ప్రతిభా సిన్హాకి హీరోయిన్‌గా ఇంకా ఎలాంటి గుర్తింపూ లభించలేదు 'బాలీవుడ్'లో.

ప్రతిభ ఇప్పుడు తన 'ప్రతిభ'ను తెలుగు తెరపై ప్రదర్శించబోతోంది. 'పోకిరి రాజా' చిత్రంలో వెంకటేష్‌కి జంటగా నటిస్తోంది ప్రతిభా సిన్హా. తెలుగులో ఆమె కెరీర్ ఎలా ఉంటుందో?

మౌర్య

